సాక్షి ప్రకాశం

శుక్రవారం । 7 । జూన్ । 2024



మెరుగ్గా పశువైద్య సేవలు

పశుపోషకులకు ఎటువంటి ఇబ్బంది తలెత్తకుండా గ్రామీణ ప్రాంతాల్లో సైతం మెరుగైన పశువైద్య సేవలు అందిస్తున్నట్లు పశు సంవర్ధకశాఖ జేడీ బేబీరాణి తెలిపారు. - 8లో..



ఆడుతూ..పాడుతూ..!

ఒంగోలులోని జిల్లా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరం నేటితో ముగియనుంది. రోజుకు సరాసరిన వంద మంది విద్యార్థులు పాల్గొన్నారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
34/25

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

మానసిక వికలాంగుల పాఠశాలలో దరఖాస్తుల ఆహ్వానం

ఒంగోలు: స్థానిక కర్నూలు రోడ్డులోని ఉమా మానసిక వికలాంగుల ప్రత్యేక పాఠశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి మానసిక వికలాంగులైన బాలబాలికల ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ ఎస్‌పీ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నిదానంగా స్పందించడం, స్పష్టంగా భావాలను వ్యక్తపరచలేకపోవడం, త్వరగా నేర్చుకోలేకపోవడం, త్వరగా అర్థం చేసుకోలేకపోవడం, సొంత నిర్ణయాలు తీసుకోలేని వారు, 18 సంవత్సరాల్లోపు మానసిక వైకల్యం కలిగిన బాలబాలికలు ఒంగోలులోని తమ పాఠశాలలో ప్రవేశం పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. విద్యార్థుల మానసిక స్థాయిని బట్టి వారిని ఆయా తరగతులలో చేర్చుకుంటామన్నారు. పూర్తి వివరాలకు 6281638739, 6309495451 నంబర్లను సంప్రదించాలని కోరారు.

గోడౌన్‌కు చేరిన ఈవీఎంలు

- పరిశీలించిన కలెక్టర్ దినేష్‌కుమార్



గోడౌన్‌లో భద్రపరిచిన ఈవీఎంలను పరిశీలిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ముగియడంతో సంబంధిత ఈవీఎంలను గోడౌన్‌కు తరలించి భద్రపరిచారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ స్థానిక మామిడిపాలెం ఈవీఎం గోడౌన్‌లో భద్రపరిచిన ఈవీఎంలను గురువారం పరిశీలించారు. అనంతరం గోడౌన్‌కు సీలు వేశారు. అక్కడి భద్రతా చర్యలు, సీసీ కెమెరాల పనితీరు గురించి అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో 8 అసెంబ్లీ నియోజకవర్గాలు, ఒక పార్లమెంట్ నియోజకవర్గానికి వినియోగించిన ఈవీఎంలను వేర్వేరుగా పటిష్టమైన భద్రత మధ్య భద్రపరిచామని కలెక్టర్ తెలిపారు. పోస్టల్ బ్యాలెట్లను కూడా జిల్లా ట్రెజరీ స్ట్రాంగ్ రూంకు తరలించి భద్రపరిచామన్నారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు, దర్శి నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు సుబ్బారెడ్డి, లోకేశ్వరరావు, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, రాజశేఖర్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

అక్షర నిక్షేపాలు

గ్రంథాలయాలు..జ్ఞానధారలు..ఇంటర్నెట్ వచ్చే వరకూ ఇవి మనందరికీ విజ్ఞాన భాండాగారాలు. సామాజిక జీవనంలో భాగమయ్యాయి. విద్యను, అక్షరాస్యతను పెంపొందించేందుకు వేదికలుగా ఉన్నాయి. కొత్త ఆలోచనలు, సృజనాత్మకత, దృక్కోణాలను రూపొందించి ఆధునిక సమాజ నిర్మాణానికి దోహదపడుతున్నాయి. భాషానిలయాలను అభివృద్ధి చేసేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం దృష్టి సారించింది. నిర్లక్ష్యానికి గురైన గ్రంథాలయ వ్యవస్థను గాడిలో పెట్టింది. సొంత భవనాలు లేని చోట నిర్మించింది. గ్రంథాలయాలకు ఎప్పటికప్పుడు అనేక కొత్త పుస్తకాలు తెప్పించి నిరుద్యోగులకు అందుబాటులో ఉంచింది. దీంతో గ్రూప్ 2, డీఎస్సీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులు, నిరుద్యోగులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుంటున్నారు.

- జిల్లాలో 66 గ్రంథాలయాలు
- 67,161 మందికి సభ్యత్వం
- ఒంగోలులోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో 75 వేల పుస్తకాలు
- నిరుద్యోగులకు అందుబాటులో కాంపిటేటివ్ పుస్తకాలు
- గ్రంథాలయంలో తెలుగు, హిందీ, ఇంగ్లిషు, ఉర్దూ, సంస్కృతం పుస్తకాలు
- ప్రతి ఆదివారం చిన్నారులతో చదవడం మా కిష్టం కార్యక్రమం



జిల్లా గ్రంథాలయంలో పుస్తకాలు చదువుతున్న పాఠకులు

ఒంగోలు టౌన్:

జిల్లాలో మొత్తం 66 గ్రంథాలయాలున్నాయి. జిల్లా కేంద్రమైన ఒంగోలులో ప్రధాన గ్రంథాలయం, డ్వాక్రా బజారులో మహిళల కోసం ప్రత్యేకంగా మహిళా గ్రంథాలయం ఉన్నాయి. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో 11,347 మందికి సభ్యత్వం ఉండగా, జిల్లా వ్యాప్తంగా 67,161 మంది సభ్యత్వం కలిగి ఉన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయానికి ప్రతిరోజూ 8 తెలుగు దినపత్రికలు, 5 ఇంగ్లిషు పత్రికలు వస్తున్నాయి. దీంతో పాటు మరో 45 మాస పత్రికలు, వార పత్రికలు వస్తున్నాయి. వివిధ భాషలకు చెందిన 75 వేల పుస్తకాలు ఉన్నాయి. జిల్లాలోని అన్ని గ్రంథాలయాల్లో మొత్తం 4,77,390 పుస్తకాలు ఉన్నాయి. వాటిలో జానపద, సాంఘిక కథలు, నాటకాలు, నాటికలు, కవిత్వం, ఆధ్యాత్మిక, అభ్యుదయ సాహిత్య పుస్తకాలు ఉన్నాయి. చరిత్ర, సైన్స్‌కు సంబంధించిన పుస్తకాలు సైతం ఉన్నాయి. శ్రీశ్రీ, తిలక్, దాశరథి, శివశంకర్, ఖాదర్ మొహిద్దీన్, అఫ్సర్ నుంచి నేటి ఆధునిక కవుల వరకు అనేక రచనలు పాఠకులు చదివేందుకు అందుబాటులో ఉన్నాయి. ఒక్క జిల్లా కేంద్ర గ్రంథాలయంలోనే ప్రతిరోజూ 200 నుంచి 250 మంది వరకు పాఠకులు వచ్చి పత్రికలు, పుస్తకాలు చదువుకుంటున్నారు.

గ్రంథాలయాల నిర్మాణాలకు చొరవ...

గత ప్రభుత్వాల నిర్లక్ష్యం పుణ్యమా అని జిల్లాలోని అనేక గ్రంథాలయాలు సొంత భవనాలు లేక కునారిల్లుతున్నాయి. కేవలం 30 గ్రంథాలయాలకు మాత్రమే సొంత భవనాలు ఉన్నాయి. మిగిలిన 36 గ్రంథాలయాలకు సొంత భవనాలు లేవు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక త్రిపురాంతకం, హనుమంతునిపాడులో గ్రంథాలయాలకు భవనాలు నిర్మించింది. మద్దిపాడులో శరవేగంగా గ్రంథాలయ భవన నిర్మాణం జరుగుతోంది. దర్శి, కురిచేడు, తాళ్లూరులో గ్రంథాలయ భవనాల నిర్మాణాలకు స్థల సేకరణ పూర్తయింది.

నిరుద్యోగులకు అండగా...

గత కొంతకాలంగా జిల్లా కేంద్ర గ్రంథాలయం వివిధ ఉద్యోగాలకు పరీక్షలు రాసేందుకు సిద్ధమయ్యే నిరుద్యోగులకు అండగా నిలుస్తోంది. ఇంటి వద్ద సరైన సౌకర్యాలు లేని వారి కోసం, నిరుపేద అభ్యర్థులు, ప్రశాంతంగా పరీక్షలకు సిద్ధమయ్యేవారికి కేంద్ర గ్రంథాలయం అనువుగా ఉంది. ఇక్కడ గ్రూపులకు ప్రిపేరయ్యేవారికి, డీఎస్సీ పరీక్షలు రాసేందుకు సన్నద్ధమయ్యే వారికి అవసరమైన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. అనేక మంది ప్రముఖ రచయితల పుస్తకాలను ప్రత్యేక చొరవతో తెప్పించారు. అంతేగాకుండా రీడర్స్ ఆన్ డిమాండ్ రిజిస్టర్‌ను ఏర్పాటు చేశారు. ఎవరికైనా ఏదైనా పుస్తకం కావాలంటే ఈ రిజిస్టర్‌లో పబ్లిషర్, రచయిత పేరుతో సహా నమోదు చేస్తే సాధ్యమైనంత త్వరగా పుస్తకాలు తెప్పిస్తారు. దీంతో సొంతంగా పుస్తకాలు కొని చదువుకునే స్తోమత లేని నిరుపేద అభ్యర్థులకు జిల్లా కేంద్ర గ్రంథాలయం ఆలంబనగా నిలబడుతోంది. అంతేగాకుండా గ్రూపులు, ఇతర ఉద్యోగాలకు ప్రిపేరయ్యే అభ్యర్థుల కోసం గ్రంథాలయంలో ప్రత్యేకంగా ఒక గదిని కేటాయించారు. మంచినీరు, ఇతర సౌకర్యాలు అందుబాటులో ఉంచారు. దీంతో కొంత మంది విద్యార్థులు, నిరుద్యోగులు ఇంటి వద్ద నుంచి భోజనం తెచ్చుకుని సాయంత్రం వరకు ఇక్కడే ఉండి చదువుకుంటున్నారు. ఇటీవల జరిగిన గ్రూపు–2 పరీక్షలకు సుమారు 150 మందికిపైగా గ్రంథాలయంలో ప్రిపేర్ కావడం గమనార్హం.

చిన్నారుల్లో పుస్తకాలు చదవడంపై ఆసక్తి...

జిల్లా గ్రంథాలయంతో పాటు జిల్లాలోని అన్ని గ్రంథాలయాల్లో ప్రతి ఆదివారం చదవడం మా కిష్టం అనే కార్యక్రమాన్ని ప్రారంభించింది రాష్ట్ర ప్రభుత్వం. సెల్‌ఫోన్ల మాయలో పడిపోయిన చిన్నారులు చదువులకు దూరం కాకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం చదవడం మాకిష్టం అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ఉపాధ్యాయులు, సాహితీవేత్తలు, సామాజిక వేత్తలతో కలిసి ప్రతి ఆదివారం చిన్నారులతో నీతికథలు చదివించడం, అందులోని నీతిని విడమర్చి చెప్పడం ద్వారా చిన్నారుల్లో నైతిక విలువలు పెంపొందించేందుకు కృషి చేసింది. ఈ కార్యక్రమంలో అనేక మంది పిల్లలు ఎంతో ఆసక్తిగా పాల్గొనడం విశేషం.

ఆర్‌ఆర్‌బీకి ప్రిపేర్ అవుతున్నా



నేను బీటెక్ చదువుకున్నాను. ఆర్‌ఆర్‌బీలో ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్నాను. పార్ట్ టైంగా ఒక ప్రైవేటు కాలేజీలో బ్రాడ్ బాండ్ టెక్నాలజీ మీద క్లాసులు చెబుతున్నా. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో మంచి సౌకర్యాలు ఉండటంతో మిగిలిన సమయంలో ఇక్కడకు వచ్చి చదువుకుంటున్నా. అయితే, ఇందు కోసం నేను ఇంటి వద్ద నుంచే పుస్తకాలు తెచ్చుకుంటున్నాను. గ్రంథాలయంలో మంచినీటి సౌకర్యం, భోజనాలు చేసేందుకు ప్రత్యేక గది ఏర్పాటు చేయడం బాగుంది. సిబ్బంది సహకారం కూడా బాగుంది. – కోణంగి కీర్తి

మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు కృషి



పాఠకులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నాం. త్వరలోనే ఇంటర్నెట్ సౌకర్యం కూడా కల్పించనున్నాం. ఇందుకోసం గంటకు కేవలం నామమాత్రపు రుసుం వసూలు చేయనున్నాం. ఉద్యోగాలకు ప్రిపేరయ్యే అభ్యర్థుల కోసం అవసరమైన పుస్తకాలు తెప్పిస్తున్నాం. ఇంకా ఏమైనా అవసరమైతే నా దృష్టికి తీసుకొస్తే తగిన చర్యలు తీసుకుంటాను. – కాసు ఆదిలక్ష్మి, జిల్లా గ్రంథాలయం కార్యదర్శి

అధైర్యపడకండి.. అండగా ఉంటాం

- వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయం
- టీడీపీ, జనసేన దాడులను తిప్పికొట్టేందుకు ఒంగోలు పార్లమెంట్ కమిటీ ఏర్పాటు

ఒంగోలు సెంట్రల్: వరుస దాడులతో టీడీపీ, జనసేన సృష్టిస్తున్న భయానక వాతావరణానికి వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులెవరూ అధైర్యపడవద్దని, ధైర్యంగా ఉండాలని, ప్రతిఒక్కరికీ అండగా ఉంటామని వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆ పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది. రాష్ట్రంలో ఎన్నికల కౌంటింగ్ తర్వాత భయానక వాతావరణం నెలకొందని, టీడీపీ, జనసేన చేస్తున్న దాడులతో అత్యంత దారుణ పరిస్థితులు నెలకొన్నాయని అన్నారు. ప్రభుత్వం ఏర్పాటు కాకముందే టీడీపీ మూకలు రాష్ట్రవ్యాప్తంగా చెలరేగిపోతున్నాయని, ఎక్కడికక్కడ దాడులు చేస్తున్నాయని, దౌర్జన్యాలకు దిగుతున్నాయని అన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులకు దిగుతూ అత్యంత పాశవికంగా ప్రవర్తిస్తున్నారన్నారు. ఈ సమయంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలకు తోడుగా నిలిచేందుకు పార్లమెంటు నియోజకవర్గాల వారీగా కమిటీలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రతి కార్యకర్తకు, ప్రతి అక్కచెల్లెమ్మకు, ప్రతి అన్నాతమ్ముడుకూ, సోషల్ మీడియా సైనికులకు ఈ కమిటీలు తోడుగా నిలుస్తాయని పేర్కొన్నారు. బాధిత కుటుంబాలను పరామర్శించడమే కాకుండా, వారికి న్యాయపరంగా, వైద్యపరంగా, ఆర్థికంగా సహాయంగా నిలుస్తాయని చెప్పారు.

ఒంగోలు పార్లమెంటు కమిటీ సభ్యులు వీరే...

మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, ఒంగోలు పార్లమెంటు కమిటీ అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి, ఒంగోలు పార్లమెంటు ఇన్‌చార్జి డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు, మాజీ ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి, కనిగిరి ఇన్‌చార్జి దద్దాల నారాయణ కమిటీ సభ్యులుగా ఉన్నారు.

వసతి గృహాల్లో ప్రవేశాలను ప్రోత్సహించండి



సమావేశంలో మాట్లాడుతున్న ఏఎస్‌డబ్ల్యూఓ లింగయ్య

- ఏఎస్‌డబ్ల్యూఓ లింగయ్య

ఒంగోలు సెంట్రల్: ఒంగోలు డివిజన్ పరిధిలోని సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో 2024–25 విద్యా సంవత్సరంలో విద్యార్థుల ప్రవేశాలు నూరు శాతం జరిగేలా విద్యార్థుల తల్లిదండ్రులకు తగిన సమాచారం ఇచ్చి ప్రోత్సహించాలని సహాయ సాంఘిక సంక్షేమాధికారి (ఏఎస్‌డబ్ల్యూఓ) టి.లింగయ్య సూచించారు. ప్రగతిభవన్‌లో సాంఘిక సంక్షేమ శాఖ ఏఎస్‌డబ్ల్యూఓ కార్యాలయంలో గురువారం వసతి గృహాల సంక్షేమాధికారులు (హెచ్‌డబ్ల్యూఓలు)తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్‌డబ్ల్యూఓ లింగయ్య మాట్లాడుతూ ఆయా పంచాయతీలలో వెల్ఫేర్ అసిస్టెంట్ ద్వారా విద్యార్థుల వివరాలు తెలుసుకుని అర్హత ఉన్న విద్యార్థులకు సమాచారం ఇచ్చి దరఖాస్తు చేసుకునేలా చూడాలని చెప్పారు. డివిజన్ పరిధిలోని ఐదు మండలాల్లో 13 వసతి గృహాలు ఉన్నాయని, అందులో ప్రీ మెట్రిక్ వసతి గృహాలలో బాలురకు ఐదు, బాలికలకు మూడు వసతి గృహాలు ఉన్నాయని తెలిపారు. వాటిలో మూడు నుంచి ఐదో తరగతి వరకు ప్రవేశానికి అవకాశం ఉన్న విషయాన్ని స్పష్టంగా చెప్పాలని కోరారు. అదే విధంగా జూనియర్ కళాశాలకు చెందిన పోస్ట్‌మెట్రిక్ వసతి గృహాల్లో రెండు బాలురకు, మూడు బాలికలకు ఉన్నాయని తెలిపారు. వాటిలో ఉన్న సౌకర్యాల గురించి వివరించారు. జూన్ 1 నుంచి పోస్ట్‌మెట్రిక్ వసతి గృహాల్లో వసతి కల్పిస్తున్నట్లు చెప్పాలన్నారు. అడ్మిషన్లు పొందగోరు విద్యార్థులు సంబంధిత ధ్రువీకరణ పత్రాలను ఒంగోలు, మద్దిపాడు, బి.నిడమానూరు, అమ్మనబ్రోలు సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో ఇవ్వాలన్న విషయాన్ని స్పష్టంగా తెలియజేయాలని చెప్పారు. అదే విధంగా ఆయా సంక్షేమ వసతి గృహాల్లో ఉన్న చిన్నపాటి మరమ్మతులు పూర్తి చేయించి చక్కగా ఉండేలా చూడాలని సూచించారు. గత విద్యాసంవత్సరంలో ఆయా వసతి గృహాల్లో 133 మంది విద్యార్థులకు గానూ 113 మంది మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించడంపై ఆయా వసతి గృహాల సంక్షేమ అధికారులను అభినందించారు. సమావేశంలో ఆయా వసతి గృహాల సంక్షేమ అధికారులు అంకబాబు, పార్వతి, రాఘవ, ప్రభుదాస్, అరుణ, శ్రీలత, స్వప్నలత, శిరీష, మునికుమార్, దుర్గా తదితరులు పాల్గొన్నారు.



నళినీప్రియ కూచిపూడి కళానిలయంలో శాస్త్రీయ నృత్యంలో శిక్షణ పొందుతున్న విద్యార్థినులు



రాజీవ్‌నగర్‌లో డ్యాన్స్ నేర్చుకుంటున్న చిన్నారులు



జూబ్లియంట్ స్కూల్లో డ్రాయింగ్, పెయింటింగ్‌లో శిక్షణ పొందుతూ...



శర్మా కళాశాల ఆవరణలోని స్కూల్లో మ్యూజిక్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు







చిచ్చర పిడుగులు..!

వేసవి సెలవులను పలువురు విద్యార్థులు చక్కగా సద్వినియోగం చేసుకుంటున్నారు. వారికి ఆసక్తి ఉన్న కళల్లో శిక్షణ పొందుతూ నైపుణ్యాలు ప్రదర్శిస్తున్నారు. ఒంగోలు నగరంలోని పలు ప్రాంతాల్లో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాలు, కళా నిలయాల్లో మ్యూజిక్, డ్యాన్స్, సంప్రదాయ నృత్యాలు, డ్రాయింగ్, పెయింటింగ్, తదితర కళా రంగాల్లో కోచింగ్ తీసుకుంటున్నారు. నిపుణుల ఆధ్వర్యంలో శిక్షణ పొంది సత్తాచాటుతూ చిచ్చర పిడుగులుగా పేరొందుతున్నారు. – సాక్షి, ఒంగోలు

తొమ్మిదేళ్ల బాలిక హత్య

అర్ధవీడు (బేస్తవారిపేట): అర్ధవీడు మండల కేంద్రంలో తొమ్మిదేళ్ల బాలిక హత్యకు గురైన సంఘటన గురువారం చోటుచేసుకుంది. అర్ధవీడు జెడ్పీ హైస్కూల్లో అటెండర్‌గా ఉద్యోగం చేస్తున్న పుచ్చకాయల రమణారెడ్డి, లక్ష్మీపద్మావతి దంపతులకు పిల్లలు లేకపోవడంతో రాచర్ల మండలం అనుమలవీడుకు చెందిన తమ్ముడు వెంకట రంగారెడ్డి కుమార్తె అయిన సాన్వికరెడ్డి (9)ని ఆరు నెలల వయసు ఉన్నప్పుడే దత్తత తీసుకుని పెంచుకుంటున్నారు. సాన్వికరెడ్డి అర్ధవీడులోని ఓ ప్రైవేటు పాఠశాలలో 3వ తరగతి చదువుతోంది. గురువారం ఉదయం బంధువుల పొలంలో బోరు వేస్తుండటంతో రమణారెడ్డి అక్కడకు వెళ్లాడు. ఇంట్లో రెండు బెడ్‌రూమ్‌లలో ఒక బెడ్‌రూమ్‌కు ఇంటి బయటి నుంచే తలుపు ఏర్పాటు చేసుకున్నారు. సాన్వికరెడ్డి అదే బెడ్‌రూమ్‌లో నిద్రపోయింది. రమణారెడ్డి తల్లిదండ్రులు హాల్లో టీవీ చూస్తున్నారు. భార్య లక్ష్మీపద్మావతి ఇంట్లోని మరో బెడ్‌రూమ్‌లో పడుకున్నారు. పొలం నుంచి వచ్చిన రమణారెడ్డి కుమార్తె పడుకుని ఉన్న బెడ్‌రూమ్‌లోకి వెళ్లి చూడగా, మొహంపై దిండు ఉంది. దిండు తొలగించి చూస్తే గొంతుకు గాయాలతో అచేతన స్థితిలో పడి ఉంది. వెంటనే గ్రామంలోని ఆర్‌ఎంపీ వద్దకు తీసుకెళ్లారు. పరిశీలించిన ఆర్‌ఎంపీ అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. చిన్నారి మృతితో కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు. హత్య చేసింది ఎవరు, ఎందుకు చేశారనే విషయాలు ఎవరికీ అంతుబట్టలేదు. కంభం సీఐ రామకోటయ్య, ఎస్సై ఎం.అనిత సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. పోలీసుల దర్యాప్తులో హత్యకు కారణాలు తెలియాల్సి ఉంది.



మృతిచెందిన సాన్వికరెడ్డి

పొగాకు గరిష్ట ధర రూ.331

- 4,493 బేళ్ల కొనుగోలు
- ఆర్‌ఎం లక్ష్మణరావు వెల్లడి

ఒంగోలు సెంట్రల్: ఒంగోలు పొగాకు బోర్డు పరిధిలో గురువారం నిర్వహించిన వేలంలో 4,493 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేసినట్లు ఆర్‌ఎం లక్ష్మణరావు తెలిపారు. కేజీ గరిష్ట ధర రూ.331, కనిష్ట ధర రూ.205, సరాసరి ధర రూ.248.05 పలికినట్లు చెప్పారు. జిల్లాలోని వేలం కేంద్రాలకు రైతుల నుంచి 4,405 బేళ్లు రాగా, వాటిలో 4,493 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారన్నారు. 412 బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించినట్లు చెప్పారు. 74 రోజుల పాటు జరిగిన వేలంలో ఇప్పటి వరకు 2,70,315 బేళ్లు, అనగా 34139494.40 కేజీలను వ్యాపారులు కొనుగోలు చేసినట్లు ఆర్‌ఎం వెల్లడించారు.

జిల్లాలో పలు ప్రాంతాల్లో వర్షాలు

● సరాసరి 14.7 మి.మీ నమోదు

ఒంగోలు సెంట్రల్: జిల్లాలో పలు ప్రాంతాల్లో వర్షాలు కురిశాయి. 34 మండలాల్లో 572.2 మి.మీ, సరాసరి 14.7 మి.మీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. అందులో యర్రగొండపాలెంలో 64.2 మి.మీ, త్రిపురాంతకం 48.8, హెచ్ఎంపాడు 46.2, పీసీపల్లి 34.0, కురిచేడు 32.0, పుల్లల చెరువు 30.8, తర్లుపాడు 28.4, మద్దిపాడు 28.2, దర్శి 26.2, వెలిగండ్ల 25.2, దొనకొండ 24.0, చీమకుర్తి 19.4, తాళ్లూరు 17.2, సీఎస్‌పురం 12.4, ఎస్ఎన్‌పాడు 11.8, కొనకనమిట్ల 11.4, నాగులుప్పలపాడు 10.8, కొండపి, ముండ్లమూరు 8.6 మి.మీ చొప్పున, మార్కాపురం 8.4, సింగరాయకొండ, దోర్నాల 8.2 చొప్పున, ఒంగోలు, ఒంగోలు అర్బన్ 7.4 చొప్పున, పొదిలి 7.2, జరుగుమల్లి 7.0, పెద్దారవీడు 6.8, టంగుటూరు 5.2, పొన్నలూరు 5.0, మర్రిపూడి, బేస్తవారి పేట 2.6 చొప్పున, కొత్తపట్నం, కనిగిరి, పామూరు 2.4 చొప్పున, కంభం 1.8 మి.మీ మొత్తం 573.2 మి.మీ వర్షపాతం నమోదైనట్లు తెలిపారు.

ఓపెన్ స్కూల్ పరీక్షలకు 155 మంది గైర్హాజరు

ఒంగోలు: ఏపీ ఓపెన్ స్కూల్ సప్లిమెంటరీ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 155 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఓపెన్ స్కూల్ జిల్లా చైర్మన్, కో ఆర్డినేటర్లు డి.సుభద్ర, బి.శ్రీనివాసరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి గణితం పరీక్షకు 483 మందికి గాను 394 మంది హాజరయ్యారు. ఇంటర్ గణితం పరీక్షకు 408 మందికి గాను 358 మంది, హిస్టరీ పరీక్షకు 92 మందికి గాను 76 మంది హాజరయ్యారు. మొత్తంగా పదో తరగతి పరీక్షల్లో 89 మంది, ఇంటర్ పరీక్షలకు 66 మంది గైర్హాజరయ్యారు.

రెండు ద్విచక్ర వాహనాలు ఢీ, ముగ్గురికి గాయాలు

ముండ్లమూరు: మండలంలోని మారెళ్ల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. మండలంలోని పూరిమెట్ల గ్రామానికి చెందిన అద్దంకి యువరాజు అమ్మమ్మ గోచిపాతల మరియమ్మకు ఆరోగ్యం సరిగా లేకపోవడంతో మారెళ్లలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ద్విచక్రవాహనంపై గురువారం రాత్రి బయలుదేరాడు. మారెళ్ల సమీపంలో ఈదర గ్రామానికి చెందిన కాలువ జాన్ ద్విచక్ర వాహనంపై ఎదురుగా వస్తుండడంతో రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రమాదంలో యువరాజుకి కాలు విరిగింది. జాన్‌కి, మరియమ్మలకు స్వల్ప గాయాలయ్యాయి. వారిని 108 వాహనంలో అద్దంకి వైద్యశాలకు తరలించారు.



ప్రమాదంలో గాయపడిన అద్దంకి యువరాజు

ఆడుతూ.. పాడుతూ..





గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన వేసవి శిక్షణ శిబిరాల్లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

- నేడు వేసవి విజ్ఞాన శిబిరం ముగింపు
- సరాసరిన ప్రతి రోజు 100 మంది విద్యార్థుల హాజరు
- వేసవి సెలవులను సద్వినియోగం చేసుకున్న చిన్నారులు
- ఆడుతూ పాడుతూ నైపుణ్యాలు పెంచుకున్న విద్యార్థులు

అప్పటి దాకా స్కూలు, హోం వర్కులతో క్షణం తీరిక లేకుండా గడిపిన పిల్లలు వేసవి వచ్చిందంటే చాలు ఎంతో రిలాక్స్‌గా ఫీలౌతారు. ఏదో స్వేచ్ఛ లభించినట్లు అల్లరి చేస్తారు. ఇల్లంతా గందరగోళం సృష్టిస్తుంటారు. అయితే కొంత మంది చిన్నారుల మాత్రం వేసవిని వృథాగా చేసుకోకుండా నైపుణ్యాలు నేర్చుకుంటూ సద్వినియోగం చేసుకున్నారు. జిల్లా గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన శిక్షణ శిబిరంలో తమకు ఇష్టమైన విభాగాల్లో శిక్షణ పొందారు.

ఒంగోలు టౌన్:

ఒంగోలు జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గత నెల 15వ తేదీ నుంచి వేసవి విజ్ఞాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. 21 రోజుల పాటు కొనసాగిన ఈ శిబిరం శుక్రవారంతో ముగిస్తుంది. ఈ వేసవి శిబిరంలో ప్రతి రోజూ 100 మంది విద్యార్థుల వరకు హాజరయ్యారు. 6 నుంచి 10వ తరగతి చదువుకుంటున్న విద్యార్థులు తమకు ఇష్టమైన ఆటపాటలను నేర్చుకున్నారు. డ్రాయింగ్, పెయింటింగ్, పేపర్ క్రాఫ్ట్, మైమింగ్, మోనో యాక్టింగ్, ఈజీ గణితం, పుస్తకాలు చదవడం, కథలు చదవడం వినిపించడం లాంటి అంశాల్లో నైపుణ్యం పెంచుకున్నారు. హైదరాబాద్, అనంతపురం, చెన్నై నుంచి వేసవి సెలవులకు అమ్మమ్మ ఇంటికి, నానమ్మ దగ్గరికి వచ్చిన చిన్నారులు సైతం ఈ శిబిరంలో పాల్గొన్నారు. చిన్నారులు ప్రతి రోజు ఉదయాన్నే గ్రంథాలయాలకు వచ్చి తమకు ఆసక్తి ఉన్న విభాగాల్లో ఉత్సాహంగా శిక్షణ పొందారు. వేసవి సెలవుల్లో సెల్‌ఫోన్ ప్రపంచంలో మునిగిపోకుండా వేసవి శిక్షణ శిబిరాల్లో పాల్గొన్న చిన్నారులను పలువురు అభినందనలు తెలియజేస్తున్నారు.

నటన అంటే ఇష్టం



నాకు చిన్నప్పటి నుంచి నటన అంటే ఇష్టం. అందుకే ఈ వేసవి శిబిరంలో స్కిట్ వేశాను. శ్రీరామ నవమి, ఉగాది పండుగలు, స్కూలు వార్షికోత్సవం సందర్భాన్ని పురస్కరించుకొని అనేక పాత్రలు వేశాను. నాకైతే సైంటిస్ట్ కావాలని ఉంది.

– పులి కార్తీక్, 7వ తరగతి

పేపర్ క్రాఫ్ట్స్ నేర్చుకున్నాను



నేను గత 3 ఏళ్లుగా వేసవి విజ్ఞాన శిబిరానికి వస్తున్నాను. ప్రతిసారి ఏదో ఒక కొత్త అంశాన్ని నేర్చుకుంటున్నాను. ఈ సారి పేపర్ క్రాఫ్ట్ నేర్చుకున్నాను. మైమింగ్‌లో శిక్షణ పొందాను. డ్రాయింగ్‌లో మెళకువలు తెలుసుకున్నాను. జిల్లా గ్రంథాలయ సిబ్బంది ఎంతో ప్రోత్సహించారు.

– అక్షర విద్య, 8వ తరగతి విద్యార్థిని

దేశభక్తి గీతాలు నేర్చుకున్నాను



గత ఏడాది జరిగిన వేసవి శిబిరంలో కూడా నేను పాల్గొన్నాను. నాకు పాటలంటే ఎంతో ఇష్టం. దేశభక్తి పాటలు, అభ్యుదయ గీతాలు నేర్చుకున్నాను. ఇదే మన భారతం పాట నాకు ఎంతో స్ఫూర్తినిచ్చింది. సంస్కృతిని ప్రతిబింబించే పాటలతో మంచిపేరు తెచ్చుకోవాలనుంది.

– కొల్లిపల్లి జాగృతి, 9వ తరగతి

సాంస్కృతిక కార్యక్రమాలంటే ఇష్టం



జిల్లా గ్రంథాలయంలో ప్రతి ఏటా నిర్వహించే వేసవి విజ్ఞాన శిబిరాలకు గత 3 ఏళ్లుగా హాజరవుతున్నాను. నాకు మొదటి నుంచి సాంస్కృతిక కార్యక్రమాలంటే ఎంతో ఇష్టం. అందుకే ఈ వేసవి శిబిరంలో డ్రామా, స్కిట్స్‌లకు సంబంధించిన విషయాలను నేర్చుకున్నాను. పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటండి అనే సందేశంతో ఒక స్కిట్ ప్రదర్శించాం. అందులో రైతు పాత్ర పోషించాను. అంతకుముందు శ్రీ కృష్ణ దేవరాయలు పాత్రను మరచిపోలేను.

– గుంజి కాత్యాయని, 10వ తరగతి.

యోగా నేర్చుకున్నాను:



నేను అనంతపురం కేంద్రీయ విద్యాలయంలో 10వ తరగతి చదువుతున్నాను. సెలవుల్లో ఊరికి వచ్చాను. శిబిరంలో డ్రాయింగ్‌లో మెళకువలను నేర్చుకున్నాను. యోగాలో శిక్షణ పొందాను. గణితం ఈజీగా చేయడం ఎలాగో తెలిసింది. ఈ అనుభవాన్ని మరచిపోలేను. ఈ వేసవి శిబిరం నాకు ఎన్నో నేర్పించింది.

రేపల్లె సుజయ్, పదో తరగతి

ఆర్థిక ఇబ్బందులతో యువకుడు ఆత్మహత్య

పెద్దదోర్నాల: ఆర్థిక ఇబ్బందులు, కటుంబ కలహాలతో సుందరయ్య కాలనీకి చెందిన అడ్డాకుల శేఖర్ (36) ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన బుధవారం రాత్రి జరిగింది. స్థానికులు పోలీసులకు సమాచారం అందజేశారు. సంఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ఎస్సై అంకమరావు కథనం మేరకు.. సుందరయ్య కాలనీకి చెందిన శేఖర్ డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. 14 ఏళ్ల క్రితం శేఖర్‌కు స్థానికంగా ఓ యువతితో ప్రేమ వివాహమైంది. అప్పడి నుంచి భార్యాభర్తలు అన్యోన్యంగానే కాపురం చేసుకున్నారు. ఇటీవల భార్యాభర్తల మధ్య కొద్దిపాటి వివాదాలు పొడచూపటంతో 20 రోజుల క్రితం భార్య బంధువుల ఇంటికి వెళ్లిపోయింది. దీంతో పాటు కొంత మేర ఆర్థిక ఇబ్బందులు కూడా శేఖర్‌ను కుంగదీశాయి. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి తను నివాసం ఉంటున్న ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతదేహాన్ని మార్కాపురం ఏరియా వైద్యశాలకు తరలించి పోస్టుమార్టం అనంతరం కుటుంబసభ్యులకు అందజేసినట్లు ఎస్సై తెలిపారు. మృతునికి నాగలక్ష్మి, నానిలు సంతానం. మృతుని కుటుంబానికి స్థానిక సేఫ్టీ డ్రైవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ షెక్షావలి రూ.5 వేల ఆర్థికసాయం అందించటంతో పాటు, భవిష్యత్‌లో మృతుని కుమార్తె నాగలక్ష్మి వివాహానికి ఆర్థికసాయం అందిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు రమేష్, విజయ్, వెంకీ, వీరయ్య, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



మృతుని కుటుంబానికి ఆర్థికసాయం అందిస్తున్న డ్రైవర్స్ యూనియన్ నాయకులు



అడ్డాకుల శేఖర్ (ఫైల్)

వైభవంగా ముగిసిన గంగాభవానీ తిరునాళ్ల



గంగాభవానీ, బొల్లావుల మూలవిగ్రహమూర్తులు

పామూరు: మండలంలోని మోపాడు గ్రామ సమీపంలోని మోపాడు రిజర్వాయర్ వద్ద ఉన్న గంగాదేవి ఆలయంలో గత 5 రోజుల నుంచి జరుగుతున్న గంగాభవానీ తిరునాళ్ల గురువారం అత్యంత వైభవంగా ముగిసింది. తిరునాళ్ల సందర్భంగా పలువురు నాయకులు, భక్తులు ప్రత్యేక పూజల్లో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. గ్రామాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున ఆలయానికి తరలివచ్చారు. ఆలయ ప్రాంగణంలో పొంగించిన పొంగళ్లను గంగాభవానీ మాతకు నైవేద్యంగా సమర్పించారు. అదే విధంగా వివిధ గ్రామాల నుంచి ఆలయానికి ప్రత్యేక అలంకరణతో తరలివచ్చిన ట్రాక్టర్లు భక్తులకు కనువిందు చేశాయి. అనంతరం ఆలయ సమీపంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. జెడ్పీటీసీ చప్పిడి సుబ్బయ్య, సర్పంచ్ చప్పిటి వరలక్ష్మి, భక్తులు పాల్గొన్నారు.



భక్తులతో నిండిన ఆలయ ప్రాంగణం

క్షేత్రస్థాయిలో మెరుగ్గా పశువైద్య సేవలు



టీకాల కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న జేడీ బేబీరాణి



పశువైద్యశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న జేడీ

● పశుసంవర్ధక శాఖ జేడీ బేబీరాణి

కొనకనమిట్ల: పశు పోషకులకు ఇబ్బందులు కలగకుండా క్షేత్రస్థాయిలో మెరుగ్గా పశు వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామని పశుసంవర్ధ శాఖ జేడీ బేబీరాణి పేర్కొన్నారు. కొనకనమిట్ల పశు వైద్యశాలను గురువారం పరిశీలించారు. అన్ని గ్రామాల్లో గొర్రెలకు చిటిక వ్యాధి నివారణకు ముందు జాగ్రత్తగా వ్యాధి నివారణ టీకాలు వేస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో గొర్రెలకు వేస్తున్న టీకాల కార్యక్రమాన్ని పరిశీలించి పశువుల్లో వచ్చే సీజనల్ వ్యాధులపై పశుపోషకులకు సూచనలు, సలహాలు అందజేశారు. పశువుల పెంపకం, వ్యాధులు, నివారణ మార్గాలపై అవగాహన కల్పించారు. అనంతరం స్థానిక పశు వైద్యశాల ఆవరణలో పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని కొన్ని మొక్కలు నాటారు. తొలుత గ్రామంలో చేపట్టిన పశుగ్రాసం క్షేత్రాలను పరిశీలించారు. అవసరమైన వారికి గడ్డి జొన్నలు అందజేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని జేడీ బేబీరాణి అన్నారు. ఆమెతో పాటు స్థానిక పశు వైద్యాధికారి అమూల్య, వెటర్నరి అసిస్టెంట్ పూర్ణచంద్రరావు, ఆఫీస్ సభార్డినేటర్ నాగార్జున రెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి దుర్మరణం

జగ్గయ్యపేట: రోడ్డు ప్రమాదంలో బీటెక్ విద్యార్థి మృతి చెందిన ఘటన పట్టణంలో బుధవారం రాత్రి జరిగింది. దర్శికి చెందిన రావులపల్లి శ్రీనివాసరావు (20) ఓ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ తృతీయ సంవత్సరం చదువుతున్నాడు. బుధవారం రాత్రి అదే కళాశాలలో చదువుతున్న స్నేహితుడు సయ్యద్ సలీంతో కలిసి చిల్లకల్లు నుంచి ద్విచక్ర వాహనంపై కళాశాలకు వస్తుండగా మారుతీ షోరూం సమీపంలో అదుపు తప్పి డివైడర్ ఢీకొట్టారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన శ్రీనివాసరావు అక్కడికక్కడే మృతి చెందాడు. సలీంకు తీవ్ర గాయాలయ్యాయి. మృతుడి తల్లిదండ్రుల ఫిర్యాదు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రాత్రి సమయంలో విద్యార్థులను బయటకు ఎందుకు పంపించారని మృతుడి తల్లిదండ్రులు గురువారం ఉదయం కళాశాల ఎదుట ఆందోళన చేశారు.

వైఎస్సార్ సీపీ నేతలపై దాడి

దర్శి: మండలంలోని తూర్పు వీరాయపాలెంలో వైఎస్సార్ సీపీ నేతలపై టీడీపీ వర్గీయులు దాడి చేశారు. ఈ సంఘటన బుధవారం రాత్రి జరిగింది. ఎస్సై తెలిపిన వివరాల మేరకు..ముప్పరాజు వెంకటేశ్వర్లు, ముప్పరాజు కోటేశ్వరమ్మ, ముప్పరాజు వెంకటేశ్వర్లుకు తల, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. 20 మందికి పైగా ముప్పరాజు శ్రీను ఇంటి పైకి వెళ్లి బాణసంచా కాల్చి వారి ఇంట్లో మహిళలపై దాడులు చేశారని బాధితులు తెలిపారు. వారిని దర్శి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం ఒంగోలు తరలించారు. టీడీపీ వర్గీయులు కూడా 14 మందిపై ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.







దాడిలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ముప్పరాజు వెంకటేశ్వర్లు, కోటేశ్వరమ్మ, వెంకటేశ్వర్లు

చీరాల ప్రజలకు అందుబాటులో ఉంటా..

చీరాల: సార్వత్రిక ఎన్నికలలో తన వెన్నంటే ఉండి తనకు పూర్తి మద్దతు తెలిపిన చీరాల ఓటర్లకు, పార్టీ నాయకులకు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలియచేస్తున్నానని వైఎస్సార్ సీపీ చీరాల అభ్యర్థి కరణం వెంకటేష్ అన్నారు. రామకృష్ణాపురంలోని క్యాంపు కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. చీరాల అసెంబ్లీ నియోజకవర్గానికి పోటీ చేయడానికి అవకాశం కల్పించిన పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. చీరాల నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటానని, భవిష్యత్‌లో జగన్ మోహన్‌రెడ్డి ఆదేశానుశారం పనిచేస్తానన్నారు. నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ ఓటమికి కారణాలను విశ్లేషించారు. ఎన్నికల్లో గెలుపోటములు సహజమన్నారు. నియోజకవర్గ ప్రజలకు తాను ఎప్పుడూ అందుబాటులో ఉంటానన్నారు. వారికి ఏ సమస్య వచ్చినా పరిష్కరిస్తానన్నారు. మళ్లీ చీరాలలోనే పోటీ చేస్తానని, చీరాల ప్రజల మన్నలను పొందుతానన్నారు. ప్రతి ఒక్కరిని కలుపుకుంటూ పోతూ వారికి వెన్నంటే ఉంటానన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడుతుందని, వారి పరిపాలన ఏ విధంగా ఉంటుందో చూస్తామన్నారు. ఏవైనా లోటుపాట్లు ఉంటే వాటిని ఎత్తి చూపుతామన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎవరూ అధైర్యపడవద్దన్నారు. రానున్న రోజుల్లో మనం గెలుస్తామని ఆయన పార్టీ నాయకులకు, కార్యకర్తలకు భరోసా ఇచ్చారు. చీరాల ఎమ్మెల్యేగా గెలుపొందిన ఎంఎం కొండయ్యకు అలానే బాపట్ల ఎంపీగా గెలుపొందిన టి.కృష్ణప్రసాద్‌కు శుభాకాంక్షలు తెలిపారు. చీరాల నియోజకవర్గ అభివృద్ధికి సుపరిపాలన అందిస్తారని ఆశిస్తున్నానన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, పట్టణ అధ్యక్షుడు కొండ్రు బాబ్జి, గుంటూరు మాధవరావు, మున్సిపల్ కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పార్టీ నాయకులు, కార్యకర్తలతో మాట్లాడుతున్న కరణం వెంకటేష్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

గుడ్లూరు: కారు ఢీకొని రిటైర్డు ఆర్టీసీ ఉద్యోగికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన గుడ్లూరు-తెట్టు ప్రధాన రహదారిలో మామిడి చెట్లు సెంటర్ వద్ద బుధవారం రాత్రి జరిగింది. వివరాల్లోకి వెళితే..మాచవరం గ్రామానికి చెందిన రిటైర్డు ఆర్టీసీ డ్రైవర్ అంజయ్య పనిపై మామిడి చెట్లు సెంటర్ వద్దకు వచ్చి తిరిగి గ్రామానికి వెళ్లడానికి రోడ్డు దాటుతుండగా వేగంగా వెళుతున్న కారు ఢీకొట్టి ఆగకుండా వెళ్లిపోయింది. దీంతో అంజయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు 108కు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న 108 సిబ్బంది అంజయ్యకు ప్రథమ చికిత్స అందించి వాహనంలో కందుకూరుకు తరలించారు. ప్రమాద స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.